క్లుప్తంగా

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



రోడ్లను పరిశీలిస్తున్న ఏఈ శ్రీవల్లి

ఎచ్చెర్ల: గ్రామాల్లో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పంచాయతీరాజ్ ఏఈ శ్రీవల్లి స్పష్టం చేశారు. లావేరు మండలంలోని తాళ్లవలస గ్రామంలో ఉపాధి హామీ నిధులు సుమారు రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను పరిశీలించారు. ఆమెతో పాటు సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఐఆర్, డీఏలు ప్రకటించాలి



మాట్లాడుతున్న కార్యదర్శి రాజు

రణస్థలం: రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి కానుకగా ఐఆర్, డీఏలు ప్రకటించాలని, పీఆర్‌సీ చైర్మన్‌ను నియమించి వీలైనంత త్వరగా పీఆర్‌సీ ఇంప్లిమెంటేషన్ చేయాలని ఏపీయూఎస్(ఆపస్) మండల ప్రధాన కార్యదర్శి సింగుపురపు రాజు కోరారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ వద్ద ఆపస్ మండల కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో నెల ప్రారంభంలోనే జీతాల జమ అనేది మూణాళ్ల ముచ్చటగా మారిపోయిందని వాపోయారు. ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కారని విమర్శించారు. అలాగే అనవసరమైన యాప్‌ల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆపస్ మండల అధ్యక్షుడు జి.చిన్ని కృష్ణంనాయుడు, జిల్లా కార్యదర్శులు జి.వి.గౌరి, ఎస్.శ్రీధర్, ఎం.రవిభట్ల, ఎస్.వేణు తదితరులు ఉన్నారు.

పరిశుభ్రతపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు

ఎచ్చెర్ల: పాఠశాల యాజమాన్య కమిటీ, సిబ్బంది పాఠశాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని బుడుమూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఉరిటి శ్రీనివాసరావు సూచించారు. పాఠశాల ఆవరణలో పాఠశాల యాజమాన్య కమిటీ ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు క్రమశిక్షణ తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పూజారి గోవిందరావు, ఎస్కే ప్రసాద్, కె.వెంకటరావు, ఎం.అనురాధ, పడాల తమ్మినాయుడు, కూన చినపెంటయ్య, సీర రమేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి వినతి



కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న హెల్త్ అసిస్టెంట్లు

అరసవల్లి: తమను విధుల్లోకి తీసుకోవాలని హెల్త్ అసిస్టెంట్లు కోరారు. ఈ మేరకు సోమవారం కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి కేంద్రమంత్రి స్పందించి ఆరోగ్య శాఖమంత్రితో, ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబుతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.మురళి, నాగరాజు, రాంబాబు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం మూడు జిల్లాల నుంచి 50 మంది హెల్త్ అసిస్టెంట్లు తదితరులు హాజరయ్యారు.

ప్రభుత్వ విద్య బలోపేతం కావాలి



డైరీని ఆవిష్కరిస్తున్న డీఈవో తిరుమల చైతన్య తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ విద్యను మరితం బలోపేతం చేసేదిశగా ఉపాధ్యాయులు విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేలా నిరంతరం కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య పేర్కొన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం శ్రీకాకుళం జిల్లా డైరీని సోమవారం డీఈవో కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఆ సంఘ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల పక్షాన నిలుస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం బలోపేతం కావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి, టెక్కలి ఉప విద్యాశాఖాధికారి విలియమ్, ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు జి.రాజేంద్రప్రసాద్, కోశాధికారి టి.ఉపేంద్ర, సభ్యులు ఎస్.గోవిందరావు, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



మొక్కజొన్న సాగు..
లాభాలు బాగు

- తక్కువ పెట్టుబడితో చేతికొస్తున్న పంట
- నేరుగా విక్రయాలు
- తప్పిన దళారుల బెడద

ఎచ్చెర్ల: రైతు ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే విభిన్న మార్గాలను అనుసరించాల్సిన అవసరం ఉంది. కాలానుగుణంగా ఆధునిక పద్ధతులు అవలంభిస్తూ అక్కడి పరిస్థితులకు తగ్గట్టుగా పంటల సాగును ఎంచుకోవాలి. మొక్కజొన్న సాగు ఒకప్పుడు చాలా అరుదుగా జరిగేది.

కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితం అయ్యేది. వాణిజ్య పంటగా ఎదగడంతో ప్రస్తుతం ప్రతీ మండలానికి విస్తరించింది. కొన్ని ప్రాంతాల్లో వరితో పాటు మొక్కజొన్నను ఎక్కువగా సాగు చేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అనతి కాలంలోనే మంచి ఆదాయాన్ని ఇవ్వడంతో సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు.

ఎచ్చెర్ల నియోజకవర్గంలో...

ఎచ్చెర్ల నియోజకవర్గంలోని లావేరు మండలంలో 9 వేలు, రణస్థలం మండలంలో 4 వేలు, జి.సిగడాం మండలంలో 8 వేలు, ఎచ్చెర్ల మండలంలో 2 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగులో ఉంది. మొక్కజొన్నలో స్వీట్‌కార్న్, బేబీకార్న్ కూడా పండిస్తున్నారు. ఈ పంటను ఏడాది మొత్తం పండిస్తూ పంట పొలాల వద్దనే విక్రయాలు చేపడుతున్నారు. రైతులే నేరుగా దుకాణాలు పెట్టడం వలన దళారుల బెడద లేకుండా లాభాలు వస్తున్నాయి.

సాగు పద్ధతులు

పంట భూమిని విత్తే ముందు నాగలితో మూడు, నాలుగుసార్లు దుక్కి దున్నాలి. ఆఖరి దుక్కిలో ఎకరాకు సుమారు 10 టన్నుల బాగా మాగిన పశువుల గెత్తాన్ని వేయాలి. తర్వాత నాగలితో బోదె కాలువలు చేసుకోవాలి. విత్తే ముందు నాగలితో బోదె తయారు చేసుకోవాలి. బోదెకు పైనుంచి మూడో వంతు ఎత్తులో విత్తాలి. దీనివల్ల నీటి పారుదల సులభంగా ఉంటుంది. వర్షపాతం ఎక్కువైనప్పుడు నీరు బయటకు పోయేందుకు వీలు కలుగుతుంది. మొలకెత్తిన పదిరోజుల తర్వాత ఒత్తుగా మొలచిన చోట బలంగా ఉన్న ఒక్కొక్క మొక్కను మాత్రమే ఉంచి అదనంగా ఉన్న మొక్కలను తొలగించాలి. కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెట్ లేదా థైరం లేదా కాప్టాన్‌తో విత్తన శుద్ధి చేసుకుంటే లేత దశలో మొక్కలను తెగుళ్లబారి నుంచి కాపాడుకోవచ్చు.

మొక్కజొన్న రకాలు

మొక్కజొన్నలో మూడు రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. దీర్ఘకాలిక (100–120 రోజులు), మధ్యకాలిక (90–100 రోజులు), స్వల్ప కాలిక (90 రోజుల్లోపు) పంటలు ఉన్నాయి. ఇందులో దీర్ఘకాలిక, మధ్యకాలిక, పంటలు అధిక దిగుబడిని ఇస్తుండడంతో ఎక్కువగా రైతులు వీటిసాగుకే మొగ్గు చూపుతున్నారు.

నిత్యం డిమాండ్



స్థానికంగా మొక్కజొన్న అమ్మకాలు బాగున్నాయి. లావేరు, రణస్థలం, జి.సిగడాం ప్రాంతాల్లో చాలా మంది రైతులు ఏడాది పొడవునా సాగు చేస్తున్నారు. నేరుగా రైతుల వద్దనే దుకాణాలను పెట్టి విక్రయాలను జరుపుతున్నారు. దీంతో రవాణా ఖర్చులు, ఆశీల బాధ లేకుండా నేరుగా లాభాలు వస్తున్నాయి. మంచి గిరాకీ ఉంది.

– మజ్జి అప్పలనాయుడు, మొక్కజొన్న రైతు, మురపాక

అంతర కృషి చేయాలి



అంతర కృషి చేయడం వల్ల పంటలో దిగుబడి బాగుంటుంది. విత్తిన 30 రోజులకు పశువులతో లేదా ట్రాక్టర్లతో అంతర కృషి చేస్తే కలుపు మొక్కలను నివారించవచ్చు. తర్వాత నత్రజని ఎరువులను వేసి వెంటనే బోదె నాగలిని నడిపితే కలుపు మొక్కల నివారణతో పాటు వేసిన ఎరువు పంట పెరుగుదలకు దోహద పడుతుంది.

– డి.మహేష్‌నాయుడు, వ్యవసాయ అధికారి, లావేరు మండలం

రాష్ట్రస్థాయి పోటీలకు పైడిభీమవరం విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయిలో సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జె.సుదర్శనం సోమవారం తెలిపారు. క్రికెట్, అథ్లెటిక్స్ అండర్–17 విభాగంలో పి.నవ్య, డి.హారిక పి.తరుణ్ కుమార్, ఎం.చంద్రేష్, కె.కుశాల్, అండర్–19 విభాగంలో కె.మురళి, పి.చరణ్‌తో పాటు హేమర్ త్రో అండర్–17 విభాగంలో డి.చందన కుమారిలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు చెప్పారు. అలాగే ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ జూనియర్ స్టేట్‌మీట్ కర్నూల్ జిల్లా డోన్ నందు జరిగిన క్రీడా పోటీలకు డి.జ్యోతి ఎంపికైంది. ఈ హైస్కూల్ నుంచి 9 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడల పోటీలకు ఎంపికై సత్తా చాటడంపై హర్షం వ్యక్తం చేస్తూ హెచ్‌ఎం టి.శోభారాణి, పీడీ సీహెచ్ రాము, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఉద్యమ లోకానికి స్ఫూర్తిదాత మార్పు



మార్పు బాలకృష్ణమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏపీటీఎఫ్ సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉద్యమ లోకానికి స్ఫూర్తిదాతగా మార్పు బాలకృష్ణమ్మ నిలుస్తారని ఐఫియా జాతీయ కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ఏపీటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు చింతాడ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (1938) శ్రీకాకుళం జిల్లా శాఖ కార్యాలయంలో కామ్రేడ్ స్వర్గీయ మార్పు బాలకృష్ణమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్, దిలీప్‌కుమార్ మాట్లాడుతూ బాలకృష్ణమ్మ అడుగుజాడల్లో ఉపాధ్యాయులందరూ నడిచి సమాజానికి సేవ చేస్తూ, సంఘ నిర్మాణానికి, పటిష్టతకు పాటుపడాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయుల సమస్యలపై మార్పు చేసిన పోరాటాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మార్పు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు టెంక చలపతిరావు, జిల్లా అధ్యక్షుడు బల్లెడ రవి, ప్రధాన కార్యదర్శి బుక్కూరు వెంకటేశ్వర్లు, అనంత ఆచార్యులు, బాలాజీ, రవి, గార మండలం అధ్యక్షుడు శ్రీను, ఆనందరావు, రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు పెరిగేలా చర్యలు తీసుకోండి



డీఈవోను కలిసి సమస్యను వివరిస్తున్న ఎంపీ రామచంద్రరెడ్డి తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: త్వరలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో ఓటర్ల నమోదు మరింతగా పెరిగేలా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి కోరారు. ఈ మేరకు జిల్లా విద్యా శాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్యను సోమవారం సాయంత్రం ఆయన ఛాంబర్‌లో కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రత్యేకించి ప్రైవేట్ ఉపాధ్యాయుల ఓటరు నమోదు విషయంలో దిగువ స్థాయి అధికారులు ఇబ్బంది పెట్టకుండా చూడాలని కోరారు. ఓటరుగా రాజ్యాంగం కల్పించిన హక్కును ప్రైవేట్ ఉపాధ్యాయులు, లెక్చరర్లు కూడా సద్వినియోగం చేసుకునేందుకు సహకరించాలన్నారు. డీఈవోను కలిసినవారిలో అప్పుస్మ రాష్ట్ర అధ్యక్షుడు తులసీ విష్ణు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, చీఫ్ మెంటార్ కృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు ఎంవీ రావు, సత్యనారాయణ, అప్పుస్మ జిల్లా అధ్యక్షుడు బరాటం లక్ష్మణరావు, కార్యదర్శి మోహన్‌రెడ్డి, అప్పలచారి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సైకిళ్ల వితరణ



పేద విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్పొరేట్ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా పేద విద్యార్థులకు 5 సైకిళ్లను సోమవారం పంపిణీ చేయడం జరిగింది. నందిగాం జెడ్పీహెచ్ స్కూల్, కాపు తెంబూరు జెడ్పీహెచ్ స్కూల్, కొత్త అగ్రహారం ఎంపీపీ స్కూల్ తదితర మూడు ప్రభుత్వ పాఠశాలల నుంచి పేద విద్యార్థులను ఎంపిక చేసి ఐదు సైకిళ్లను పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌బీఐ ఆర్‌ఎం అబ్దుల్ అమీర్ హసీబ్ హాజరై మాట్లాడుతూ ప్రతిఏటా సీఎస్ఆర్ యాక్టివిటీ కింద స్టేట్ బ్యాంకు కొన్ని రూ.లక్షలు ఖర్చు చేస్తోందన్నారు. అలాగే ఇటీవల అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు.

కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ ఆపరేషన్స్ శ్రీనివాస్, బ్రాంచ్ మేనేజర్ నందిగాం శ్రీధర్, ఆఫీసర్ అసోసియేషన్ సెక్రటరీ కిషోర్‌కుమార్, స్టాఫ్ యూనియన్ రీజనల్ సెక్రటరీ కేసీహెచ్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



అజయ్‌బాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం పంచాయతీ కార్యదర్శి పుట్ల అజయ్‌బాబు ఇటీవల తీవ్ర అనారోగ్యం బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. విశాఖపట్నంలోని తన స్వగృహంలో విశ్రాంత్రి తీసుకుంటున్న అజయ్‌ను ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు సోమవారం పరామర్శించి త్వరగా కోలుకోవాలని అకాంక్షించారు.

10న విజయదుర్గకు బాలాజీ అలంకరణ

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక నానుబాల వీధిలోని విజయ దుర్గాదేవి ఆలయంలో ఈనెల 10న ముక్కోటి ఏకాదశి సందర్భంగా అమ్మవారిని బాలాజీగా అలంకరించనున్నట్లు అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణశర్మ తెలిపారు. సాయంత్రం వేంకటేశ్వరుని అలంకరణలో ఉన్న స్వామివారికి 10వేల పుష్పాలతో అర్చనలు, అనంతరం స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పుష్పార్చనలో పాల్గొనే భక్తులు 96765 60554, 96666 75514 నంబర్ల ద్వారా సంప్రదించాలని కోరారు.

అభినందనలు



కృష్ణారావును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్ర తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కామర్స్ హెచ్‌వోడీగా పనిచేస్తున్న లబ్బ కృష్ణారావు ఆదివారం జరిగిన జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో కృష్ణారావును సత్కరించారు. అధ్యాపకుల కష్టాలు, సమస్యల పరిష్కారంలో వారి పక్షాన నిలబడి పోరాడాలని వక్తలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.శంకర్‌నారాయణ, సీహెచ్ కృష్ణారావు, డాక్టర్ ప్రభాకరరావు, ఆదిలక్ష్మి, తాడు, లలితాభాయ్, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనం ప్రారంభం

గార: సమాజంలో యువత పాత్ర కీలకమని, అందరి సహకారంతో స్థానికులు సామాజిక భవనం నిర్మాణం చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని వమరవల్లి పంచాయతీ గొర్లెవానిపేట గ్రామంలో చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. రెడ్డిక సంఘం సమకూర్చిన వస్త్రాలను పేదలకు పంపిణీ చేశారు. స్థానికులు కల్యాణ మండపం కావాలని కోరడంతో కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు లోపింటి రాధాకృష్ణారెడ్డి, పొట్నూరు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేయవద్దు



అవగాహన కల్పిస్తున్న పంచాయతీ అధికారులు

రణస్థలం: మండల కేంద్రంలో జేఆర్‌పురం పంచాయతీలోని వ్యాపారస్తులు రోడ్లుపైన, బయట చెత్త వేయవద్దని పంచాయతీ అధికారి ప్రసాద్ ఆదేశించారు. సోమవారం పంచాయతీ అధికారులు పంచాయతీలో పర్యటించారు. వ్యాపారస్తులు చెత్త బుట్టలో చెత్తను వేసుకుని రోజువారీ ట్రాక్టర్‌లో వేయాలని, వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. ప్రతిరోజూ ట్రాక్టర్‌తో చెత్తను సేకరించి చెత్త సేకరణ కేంద్రానికి తరలిస్తున్నారు. దయచేసి వ్యాపారస్తులు, స్థానికులు గమనించాలని లేనిపక్షంలో అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పారిశుద్ధ్యం సూపర్‌వైజర్ పాణికుమార్, కార్మికులు ఉన్నారు.

అన్నదానం



శ్రీకాకుళం నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమం వద్ద సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మీకోసంలో దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చిన 200 మందికి ఆహార పొట్లాలను సభ్యులు అందజేశారు.

- శ్రీకాకుళం కల్చరల్

అధ్వానం



శ్రీకాకుళం నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌కి సమీపంలో ఉన్న శివాలయం దగ్గరలో పూజారివాను నగర్ నుంచి హడ్కోకాలనీకి వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా ఉంది. రెండువైపులా సిమెంట్ రోడ్డు ఉంది. మధ్యలో కల్వర్టు ఉండడంతో అక్కడ గుంతలుగా ఏర్పడి నీరు నిలిచిపోయి అటువైపుగా వెళ్లేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. మట్టిరోడ్డు, అప్రోచ్‌ని కలుపుతూ సిమెంట్ వేస్తే ప్రమాదాల నివారణకు ఉపయోగపడుతుందని కోరుతున్నారు.

- శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

గ్రానైట్ వ్యర్థాలు



రణస్థలం మండలంలో నారువ పంచాయతీలోని అక్కయ్యపాలెం గ్రావెల్ కొండ వద్ద గ్రానైట్ వ్యర్థాలు నిత్యం అర్ధరాత్రులు పడేసి వెళ్లిపోతున్నారు. దీంతో కొండ ఎక్కేందుకు మార్గం లేకుండా పోతోంది. గ్రానైట్ వ్యర్థాలు వేయకుండా అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- రణస్థలం

మంచు దుప్పటి



గత వారం రోజులుగా మంచు ప్రభావం విపరీతంగా పెరిగింది. దీంతో జాతీయ రహదారిపై గమ్యస్థానాలకు శరవేగంగా చేరుకునేందుకు వేగంగా వెళ్తున్న వాహనాలకు పొగ మంచు బ్రేకులు వేస్తోంది. సోమవారం ఉదయం 8 గంటల వరకు కురిసిన తీవ్ర పొగమంచు వలన సుమారు యాభై మీటర్ల దూరంలో ఉన్న ముందు వాహనాలు కనిపించలేదు. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు.

- రణస్థలం

డబుల్ వీల్ మార్కర్ యంత్రంతో ఉపయోగం



మెషిన్లు అందిస్తున్న రెడ్డీస్ ఫౌండేషన్ మేనేజర్ హరిబాబు

రణస్థలం: వరి మాగాణిల్లో నేరుగా మొక్కజొన్న సాగు చేసే రైతులు సమాన దూరంలో విత్తనాలు విత్తుకోవడానికి డబుల్ వీల్ మార్కర్ యంత్రం ఉపయోగకరంగా ఉంటుందని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. మండలంలోని కోష్ట గ్రామంలో తమ సంస్థ ఆధ్వర్యంలో పునరుత్పాదక వ్యవసాయ విధానాలను రైతులకు అందించే కార్యక్రమంలో భాగంగా 250 డబుల్ వీల్ మార్కర్ యంత్రాలను పరిసర ప్రాంత రైతులకు సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దున్నకుండా మొక్కజొన్న సాగు చేపట్టడం వలన అదనపు సాగు ఖర్చులు, సుమారు 3 నీటి తడులు ఆదా చేయవచ్చన్నారు. దీంతో దిగుబడి అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ మేనేజర్ పి.తవిటినాయుడు, సమన్వయకర్తలు జె.గోపాల్, కె.ఎర్నాయుడు, ఎస్.అప్పల సూర్యనారాయణ, ఎం.సత్యవతి తదితరులు ఉన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు



ఎస్‌బీఐ స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం అర్బన్: మహిళల ఆర్థికాభివృద్ధికి ఎస్‌బీఐ ఇతోధికంగా తమవంతుగా తోడ్పాటునందించడం అభినందనీయమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ గ్రౌండ్‌లోని సిక్కోలు డ్వాక్రా బజార్‌లో ఎస్‌బీఐ స్టాల్‌ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళ స్వయం సహాయక గ్రూపులకు ఎస్‌బీఐ ఎల్లప్పుడూ సాయం అందిస్తుందన్నారు. ఎస్‌బీఐ ఆర్‌ఎం అబ్దుల్ అమీర్ హసీబ్ మాట్లాడుతూ మహిళా స్వయం సహాయక గ్రూప్‌లకు ఇప్పుడు రూ.20 లక్షల వరకు ఒక్కొక్క గ్రూపునకు బ్యాంకు లోన్ ఇవ్వడం జరుగుతోందని తెలిపారు. ఈ సదుపాయాన్ని మహిళా సంఘాలు సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అదేవిధంగా అనేక ఎంఎస్‌ఎంఈ లోన్స్ స్టేట్ బ్యాంకు తమ శాఖల ద్వారా మహిళా సంఘాలకు ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. తద్వారా మహిళలు బ్యాంకు లోన్స్ సద్వినియోగం చేసుకొని మరింత ఆర్థిక పురోగతి పొందుతారన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ రామరాజు, ఎస్‌బీఐ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్వయం సహాయక సంఘాల మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఎమ్మెల్యే గొండు శంకర్ ఆకాంక్షించారు. స్థానిక మున్సిపల్ గ్రౌండ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సిక్కోలు డ్వాక్రా బజార్–2025 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిక్కోలు డ్వాక్రా బజార్‌లో ఈ వారం రోజుల్లో రూ.2 కోట్ల వ్యాపారం జరగాలన్నారు. రథ సప్తమిలో జిల్లా ఉత్పత్తులను విక్రయాలు చేసేందుకు స్థలం కేటాయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సుడా అధ్యక్షుడు కొరిగాన రవి కుమార్, వంశధార ప్రాజెక్టు కమిటీ చైర్మన్ రవీంద్ర, నాబార్డ్ డీడీఎం కె.రమేష్ కృష్ణ, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని కుప్పిలి గ్రామానికి చెందిన నిమ్మ లక్ష్మి అనే మహిళ ఇంటి వద్ద నిల్వ ఉంచిన రూ.14 వేల అక్రమ మద్యం ఎచ్చెర్ల పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. అన్ని రకాలు సీసాలు 72 స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిపై కేసు నమోదు చేశారు. గ్రామాల్లో బెల్టు షాపులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు ఎస్‌ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు.